
ప్రజాశక్తి
ఆదివారం 7 జనవరి 2024



10న బొబ్బిలిలో చంద్రబాబు బహిరంగ సభ

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 10న బొబ్బిలి రానున్నారు. రాజా కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో భాగంగా ఈ సభ జరుగనుంది. ఈమేరకు కోటలో టిడిపి ముఖ్యనేతలంతా శనివారం సమావేశం నిర్వహించారు. బహిరంగ సభను జయప్రదం చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. బహిరంగ సభ జరగనున్న రాజా కళాశాల మైదానాన్ని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, కిమిడి కళా వెంకటరావు, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, ఇతర నాయకులు పరిశీలించారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



పార్వతీపురంలో ఎస్మా చట్టం ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

ఎస్మా.. వెనక్కి తగ్గేదే లేదమ్మా

- ప్రభుత్వ నిర్ణయంపై అంగన్వాడీల ఆగ్రహం
- వినూత్న రీతిలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- వామపక్ష, ప్రజా, కార్మిక సంఘాల మద్దతు
- జిఒ 2ను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె శిబిరం 26వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు ప్రారంభించారు. ప్రభుత్వం అంగన్వాడీలపై నిర్బంధం ప్రయోగిస్తూ తీసుకొచ్చిన ఎస్మా చట్టం కాపీలను దహనం చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్మథరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సరళారాణి, గంటా జ్యోతి మాట్లాడారు. 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ న్యాయమైన సమస్యల పరిష్కరించకపోగా, ప్రభుత్వం ఎస్మా చట్టం ఉపయోగించి సమ్మె విచ్ఛిన్నం చేయాలని చూడటం దారుణమన్నారు. అత్యవసర సేవలు కింద జిఒ నంబర్ 2 తీసుకురావడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అత్యవసర సేవలంటే నీరు, కరెంటు, వైద్యం వంటివని, కానీ అంగన్వాడీలను కూడా అత్యవసర సేవల కింద తీసుకువచ్చి ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎస్మా లాంటి చట్టాలు ఉపయోగించి నిర్బంధం ప్రయోగించాలని చూస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్షలకు ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు రమణి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బొత్స లక్ష్మి, ఎపి స్టేట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ యూనియన్ జెఎసి నాయకులు బి.వి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, తదితరులు పాల్గొన్నారు.

> ఓ వైపు ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తున్నట్లు ప్రకటించినా, మరోవైపు అధికారులు నోటీసులిస్తున్నా అంగన్వాడీలు వెనుకడుగు వేయడం లేదు. పాలకుల బెదిరింపులకు, అధికారుల హుంకారాలకు అదిరిపోయేది లేదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వ తీరుపై రోజుకో రూపంలో నిరసనలు కొనసాగిస్తున్నారు. రోజురోజుకూ నిరసనలను ఉధృతం చేస్తున్నారు. మొక్కవోని దీక్షతో నిరవధిక సమ్మెను శనివారం 26వ రోజూ కొనసాగించారు. ఎస్మా చట్టం పత్రాలను దహనం చేశారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి గర్భాపు ఉదయభాను మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు మడక సత్యవతి, రెడ్డి లక్ష్మి, ఎస్.శైలజ, ఎస్.సునీత, యశోద, తదితరులు పాల్గొన్నారు.

బి.అమరవేణి, ప్రాజెక్టు అధ్యక్షులు జి. జెస్సీబాయి, ప్రతినిధులు జి.శారద, ఆర్.భవాని, ఎం.శ్యామల, శ్రీదేవి, సుగుణ, లలిత, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో శనివారం అంగన్వాడీలు ఉపవాసం ఉంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఎం.కాంతారావు పాల్గొన్నారు.

కొమరాడ : మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర రహదారిపై



సాలూరులో చెవిలో క్యాబేజీ పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఓట్లేసి తప్పు చేశామంటూ అంగన్వాడీలు గుంజీలు తీస్తూ నిరసన తెలియజేశారు. వీరికి దళిత సంఘాల జెఎసి నాయకులు బత్తిని మోహన్ రావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి

గోతుల వద్ద అంగన్వాడీలు ఆటలాడుతూ నిరసన తెలిపారు. 'మా బతుకు ఈ గోతుల్లా అవ్వకూడదు' అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జి.జయమ్మ, నాగమణి, సింహాచలం, అమ్మ భవాని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీల సమ్మె 26వ రోజు చేరుకున్న సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద ప్రధాన రహదారిపై అంగన్వాడీలు 26 అంకె ఆకారంలో కూర్చొని నిరసన తెలియజేశారు. ఆదివారం దీక్షా శిబిరం వద్ద ఎస్మా పత్రాలను ధ్వంసం చేస్తామని ఆమె తెలిపారు.

సాలూరు : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె శిబిరం వద్ద చెవుల్లో క్యాబేజీలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.





సీతంపేటలో సమ్మె శిబిరంలో పాల్గొన్న అంగన్వాడీలు : పాలకొండలో గుంజీలు తీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఎస్మా.. అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

26 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి, సమ్మెను నిషేధించాలని చూడటం అప్రజాస్వామికమని పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి వి.ఇందిర ఖండించారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా సమ్మె నిషేధిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తూ, ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యను కార్మిక, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు.

ఎస్మా ప్రయోగం.. దుర్మార్గం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవ

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు శాంతియుతంగా సమ్మె చేస్తే ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్న ఒక ప్రకటనలో ఖండించారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వంటిదని పేర్కొన్నారు. వెంటనే అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వం తీరు సరికాదు

గిరిజన సంక్షేమ సంఘం

పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికుల, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీరు సరిగా లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్మా ప్రయోగిస్తూ ఇచ్చిన జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



సాలూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

12వ రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మున్సిపల్ కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సూచించారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారు తప్ప కార్మికులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదని చెప్పారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా శనివారం కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు బైఠాయించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ కార్మికుల సమ్మెతో పట్టణాల్లో ప్రజలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని అన్నారు. వెంటనే సమ్మె విరమణకు చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులు మున్సిపల్ కార్యాలయం వద్ద మోహరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు, రవి, టి.ఇందు, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ముఖ్యమైన రహదారులపై, సరిహద్దుల్లో పోలీస్ శాఖ చెక్‌పోస్టలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్విన్‌పేట కూడలిలో పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్ వద్ద 24 గంటలూ పోలీసుల పహారా ఉంటుంది. ఒడిశా తదితర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలను చేపడుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు చెక్‌పోస్ట్ కొనసాగిస్తామని ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు.

ఆశా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాలకొండ

అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టు భర్తీకి అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ మండలం అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంపిలి గ్రామ సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12వ తేదిలోగా దరఖాస్తుతో పాటు విద్యార్హతల నకలను సంబంధిత అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి నేరుగా అందజేయాలని తెలిపారు.

కంచే చేను మేసిందట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వెనుకటి ఓ రైతు తన పొలంలో వేసిన కంచే... చేను మేసేసిందట. అచ్చంగా అలాగే ఉంది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ధాన్యం కొనుగోలు తీరు. అక్రమాల అడ్డుకట్టకు ఎన్ని నిబంధనలు పెట్టినా వాటిని అమలు చేయాల్సిన పాలకులు, అధికారులే చేతివాటం ప్రదర్శించడం లేదా, చిత్తశుద్ధి లోపించడం వల్ల రైతులు, అటు ప్రభుత్వం (అంటే ప్రజానీకం) మోసపోతునే ఉన్నారని జనం కోడై కూస్తున్నారు. ఏటా విజయనగరం ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో దోపిడీతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రాజకీయ అండదండలు గల మోతుబారి మిల్లరు పక్కదారిపట్టించి, వాటి బదులు పిడిఎస్ బియ్యం లెక్క చూపిస్తూ ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి అటువంటి పప్పులేమీ ఉడకబోవని, ధాన్యం క్రయ విక్రయాలకు కఠిన నిబంధనలు విధించామని ప్రభుత్వం ప్రగల్భాలాలు పలికింది. అందుకు తగ్గట్టే ఆసారి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేర్చే వాహనాలకు జిపిఎస్ సిస్టమ్ తప్పనిసరి చేసింది. వాహన ఛార్జీలు, కలాసీ ఛార్జీలు మొదలుకుని, గోనె సంచుల వరకు ప్రభుత్వమే భరించేందుకు నిర్ణయించింది. వీటిన్నింటికంటే ముఖ్యంగా ఆర్‌బికె లేదా గ్రామ



సచివాలయాలకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో మిల్లర్లకు కేటాయింపులు చేసేందుకు నిర్ణయించింది. కానీ, ఎన్ని నిబంధనలు పెడితే మాత్రం ఏం ఉపయోగం. రైతులకు గోనె సంచులును ఇవ్వకుండా, వాహన సదుపాయాలను సమకూర్చకుండా అధికార యంత్రాంగం ఇబ్బందులకు గురిచేయడంతో రైతులు అనివార్యంగా వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు క్వింటా సాధారణ రకం రూ.2183, 'ఎ' గ్రేడ్ రూ.2203 ధరకు బదులు రూ.200 తక్కువ ధరకు కొనుగోలు చేసుస్తున్నారు. మరీ ఇంత ఘోరమా అంటూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే గోనె సంచులు, వాహన ఛార్జీలు నష్టపోతున్నారు. తీరా మిల్లుల వద్ద వేసే కాటాల్లో ప్రతి క్వింటాపైనా అదనంగా దాదాపు 10కేజీల చొప్పు లాగేసుకుంటున్నారు. దీంతో, ఎవరికి విక్రయించినా క్వింటాకు రూ.200 నుంచి రూ.250 వరకు నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ కేటాయింపులను పక్కనబెట్టి ఆఫ్‌లైన్ కేటాయింపులకు ఇటీవల జిల్లా పరిషత్ వేదికగా నిబంధనలు సడలించడంతో పెద్దపెద్ద మిల్లర్లంతా రాజకీయ పలుకుబడితో పరిమితికి మించి కేటాయించే విధంగా చేసుకుంటున్నారు. దీంతో, తమకు పరిమితంగానే ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయని చిన్న, మధ్యతరగతి మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో, అధిక మొత్తంలో కేటయింపులు చేసుకునే మిల్లర్లంతా ఎప్పటి మాదిరిగానే తమకు వచ్చిన ధాన్యానికి బదులు పిడిఎఫ్ బియ్యాన్ని లెక్కచూపించి ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తున్నారని, ఇందులో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారని జనం చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, పాలకులు పరస్పర అవగాహనతో ముందుకు సాగిస్తున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రైతులకు అండగా నిలబడడంతోపాటు ప్రజాధనాన్ని పరిరక్షించాల్సినవారే ఈ విధంగా వ్యవహరించడం శోచనీయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఎండిఎం వాహన సిబ్బందితో మాట్లాడుతున్న జెసి గోవిందరావు

రేషన్ పంపిణీ పరిశీలన


ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని శివన్నపేటలో ఎండిఎం వాహనంతో పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులను శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకులు సరైన సమయంలో సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఎండిఎం వాహన సిబ్బందితో మాట్లాడుతూ కొలతల్లో తేడా లేకుండా సక్రమంగా సకాలంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, అర్ఐ కరుణాకర్, విఆర్ఒ స్వరాజ్యం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పేదల సొంతింటి కల జగనన్నతోనే సాకారం అవుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో 17, 18 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులకు బెలగాంలో ఉన్న సచివాలయంలో ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నర్సిపురం జగనన్న లేఅవుట్‌లో స్థలాలు వచ్చిన లబ్ధిదారులకు ఆ లేఅవుట్ రద్దు కావడంతో వెంకంపేట ప్రాంతంలో లేఅవుట్‌లో మంజూరు చేసినట్లు తెలిపారు. అక్కడ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు వార్డుల వారీగా పట్టాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, సచివాలయ కన్వీనర్లు జి.పద్మజ, ఎం.తవిటినాయుడు, కౌన్సిలర్ ఆర్.చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

టిడిపి మాయమాటలు నమ్మొద్దు

పింఛన్ల పంపిణీలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టిడిపి నాయకులు బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ధ్వజమెత్తారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి, వారి మాయలో పడవద్దని ప్రజలను కోరారు. ఎవరైతే సుపరిపాలన అందిస్తున్నారో వారినే అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ పింఛను కానుక ద్వారా కొత్తగా మంజూరైన, పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు 65 ఏళ్లకు పింఛను ఇచ్చేవారని, ఇప్పుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి 60 ఏళ్లకు, ఎస్‌టిలకు 50 ఏళ్లకు పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. 80 శాతం వికలాంగత్వం ఉన్న వారికే చంద్రబాబు హయాంలో పింఛన్లు ఇస్తే.. ప్రస్తుతం 40 శాతం ఉన్న వారికీ పింఛను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మండలంలో 7091 పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, వైసిపి మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, పి.వీరమనాయుడు, డోల బాబ్జి, వైస్ ఎంపిపిలు ధనుంజయ్, ఎం.నారాయణ, దండి శ్రీనివాసరావు, సలాది అప్పలనాయుడు, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




పాచిపెంట.. పింఛను నగదును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గుమ్మలక్ష్మీపురం : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో రూ.3 వేలు పింఛను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి తెలిపారు. శనివారం స్థానిక బిఎస్ఆర్ కళింగ వైశ్య కళ్యాణ మండపంలో నూతన, పెంచిన పింఛన్లను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇతర పార్టీల నాయకులు చెబుతున్న కల్లబొల్లి మాటలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు, జెడ్‌పిటిసి మండంగి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, మండంగి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : వైసిపి పాలనలో పేదలకు సంపూర్ణ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం మండలంలోని వెంకంపేట పంచాయతీలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద పెంచిన రూ .3 వేలతోపాటు నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 183 పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. దీంతో మొత్తం పింఛన్ల సంఖ్య 10,752కు చేరిందన్నారు. కార్యక్రమంలో సర్పంచి తీళ్ల కృష్ణారావు మాధవ, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు రవికుమార్, సిద్ధా జగన్నాథరావు, మండల కన్వీనర్ బొమ్మి రమేష్, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, పలగ నాగేశ్వరరావు, మజ్జి చంద్రశేఖరరావు, గండి శంకరరావు, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని పనస నందివాడ గ్రామంలో వైఎస్ఆర్ పింఛను కానుక ద్వారా పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచి బొమ్మాలి సరోజినీ, మాజీ సర్పంచి కె.సన్యాసినాయుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బి.ప్రకాశ్‌రావు, ఎన్.రాంబాబు, ఉపసర్పంచి రౌతు లక్ష్మి, బి.జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంరూరల్.. పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



గుమ్మలక్ష్మీపురం.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచులు సరోజినీ, సన్యాసినాయుడు

18వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం 18వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పెద్దఎత్తున ఉద్యోగులు హాజరై నిరసన తెలిపారు. అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సహేతుకంగా లేదని జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎం.ఈశ్వరరావు, కాంతారావు, భానుప్రకాశ్, బివి రమణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. రూ.28లక్షలతో అభివృద్ధి చేసిన ఇండోర్ స్టేడియంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న సహకారం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు పతకాలను సొంతం చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ద్వారా ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జోనల్ ఇన్చార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్, కుసుంబచ్చన్, ఎంకెబి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి అర్హతతో ఎసి మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆటో మేటివ్ సర్వీస్ టెక్నీషియన్, ఫోర్ అండ్ టూవీలర్, ఎనిమిదో తరగతి అర్హతతో సూయింగ్ మిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా దరఖాస్తుతో జతచేయాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 7993795796 సంప్రదించాలని కోరారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జగన్ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి అన్నారు. మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'రా కదిలి రా' అనే కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యం పరచాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాల్గున్నరేళ్ల వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సైకో పాలన నుండి కాపాడేందుకు ప్రతిఒక్కరూ కదలి రావాలని కోరారు. కులం పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రజలను ప్రాంతాల వారీగా విడగొట్టి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలనే అత్యాశతో చూస్తున్నాడని, దీనికి తగిన బుద్ధి చెప్పే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. పంచాయతీలోని ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించి స్వాహా చేయడంలో జగన్ రెడ్డికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, నాయకులు నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, కోనేదం మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, చక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, ధర్మవరం సర్పంచ్ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

ప్రజాశక్తి- చీపురుపల్లి

అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని మండల వైసిపి నాయకులు ఆపన్న హస్తాన్నందించారు. శుక్రవారం రాత్రి మండలంలో గల గచ్చలవలస గ్రామానికి చెందిన బి. భద్రయ్యకు చెందిన పూరిల్లు కాలి బూడిదయ్యింది. దీంతో సర్వం కోల్పోయిన భద్రయ్య కుటుంబానికి వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావు నిత్యావసర వస్తువులు, కూరగా యలు, వంటపాత్రలు, స్టీల్ సామాన్లను శనివారం అందజేశారు. చీపురుపల్లి తహాశీల్దార్ సురేష్ ఒక బియ్యం బస్తా అందజేశారు. భాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రావాల్సిన నష్ట పరిహారం వచ్చేలా ప్రయత్నం చేస్తామని భద్రయ్య కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమ్ము సునీల్, ఎంపిటిసి తవుడు, మంగళగిరి శ్రీనివాసరావు, రేవళ్ళ సత్తిబాబు, మార్కెట్ కమిటీ డైరక్టర్ సిమ్మలా అప్పన్న, పిసిని మహేష్, సంకుపాలెం అప్పలనాయుడు, చీపురుపల్లి నియో జకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్స్ ప్రభాత్ కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి సర్పంచ్ చేరిక

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని డి.గదబవలస ప్రస్తుత వైసిపి సర్పంచ్ జావాన రమేష్ నాయుడు ఆధ్వర్యంలో 250 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. శని వారం వారికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబి నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచ్ జావాన రమేష్ నాయుడతో పాటు ఉప సర్పంచ్ వెంపటాపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జావాన రామారావు, వార్డు మెంబర్లు కరిమజ్జి చిన్నంనాయుడు, మండల సీతమ్మ, పల్లా జయలక్ష్మి, రేవళ్ల అన్నపూర్ణమ్మ తదితరులున్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద గల గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి పునాదులు నిర్మిస్తున్నారన్న సమాచారంతో తహాశీల్దార్ శ్రీనివాసరావు శనివారం తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా పునాదులు నిర్మిస్తున్న ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూములో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకట్రావు, విఆర్ఒ రమణ, కన్నయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాపులను మోగించిన వ్యక్తి జగన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కాపు కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించి కాపులను మోసం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వబ్బిన సన్యాసినాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితులను హత్యలు చేసి డోర్ డెలివరీ చేసే వైసిపి క్రిమినల్స్ పార్టీకి కాపు, బలిజ సంఘాలు మద్ధతు ఇస్తే మహా నేరమవుతుందన్నారు. కాపులకు రిజర్వేషన్లు ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని, కాపు కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించి కాపులకు ఇచ్చే సంక్షేమ పథకాలను కూడా కార్పోరేషన్ నిదులలో లెక్కలు చూపించి కాపులను మోసం చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. కాపు రిజర్వేషన్ పోరాటాన్ని హింసాత్మకంగా మార్చిన క్రిమినల్ జగన్ రెడ్డి అని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించి జనసేన, టిడిపి కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు.

జీతాలు ఇప్పించాలంటూ వినతిపత్రం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి బకాయి జీతాలను ఇప్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఆస్పత్రి సూపరింటెంట్ నీలకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది కాంట్రాక్టర్ పద్ధతిలో పనిచేస్తున్నారని వారికి బకాయి వేతనాలు చెల్లించటంతో పాటు శానిటేషన్ కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో వారికి శనివారం యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు రావాడ రామసత్యం యూనియన్ తరపున రూ.30,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిన్నింటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఇమంది జగదీశ్వర్ రావు, కోశాధికారి చిరంజీవిరావు, రండి చల్లంనాయుడు పలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం.. వైసిపి నైజం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అసత్య ప్రచారాలు చేయడం పైస్థాయి నుంచి కింద స్థాయి వరకు ఉన్న వైసిపి నాయకుల నైజమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆక్షేపించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మంగళగిరిలో టిడిపి కేంద్ర కార్యాలయంలో సీతానగరం, పార్వతీపురం పట్టణం నుంచి వైసిపి నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తమ పార్టీలో చేరికపై తాము విడుదల చేసిన వీడియోలనే ఆధారం చేసుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆరోజు పార్టీలో చేరికల జాబితాతోపాటు ఆ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తల వీడియోలను కూడా విడుదల చేశామన్నారు. దీన్ని చూసి తట్టుకోలేని పార్వతీపురం వైసిపి నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అధికారంలో ఉన్న ఎమ్‌పిలకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు సైతం దర్శనం ఇవ్వని సిఎం జగన్ ఎప్పుడైనా సామాన్య కార్యకర్తలను పిలిచి చేరదీసి కండువాతో ఆహ్వానించడం జరిగిందా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న నాయకులు అసత్యాలను ప్రచారం చేయడం మానుకుని, హుందాగా రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని హితవుపలికారు.



పార్వతీపురంరూరల్.. సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

టిడిపి పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఈ నెల పదో తేదీన టిడిపి అధినేత చంద్రబాబు బొబ్బిలి పర్యటన విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర కోరారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుండి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున బొబ్బిలి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకులు గోవిందరాజు, చోడవరం ఇన్‌ఛార్జి బత్తుల తాతియ్యబాబు, మల్ల సురేంద్ర, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పెదరామ పంచాయతీ పరిధిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సవరతోట మొఖలింగం, బిడ్డిక అప్పారావు, గేదెల కాంతారావు, ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఇమరక పవన్, తోయక సంధ్యారాణి, గంట సుధ, మూటక భరత్ రాజ్, మండంగి కుమార్ పాల్గొన్నారు.



సీతంపేట కరపత్రాలను పంపిణీ చేస్తున్నటిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ వాటర్ వర్క్సుకి సంబంధించి నాలుగో నెంబర్ ఇన్ ఫిల్ట్రేషన్ బావిలో మోటార్ మరమ్మతుకు గురైందని కమిషనర్ టి.జయరాం ఒక ప్రకటనలో చెప్పారు. దీని కారణంగా ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తామరకండిలో వికసిత్ భారత్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని తామరకండిలో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. వికసిత్ భారత్ కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.వర్మ, సర్పంచ్ ఎంఎల్‌టి కుమారి, ఎంపిటిసి శ్రీనివాసరావు, సెక్రటరీ పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రదీప్.. రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.ఆశాజ్యోతి, ఎఎన్‌ఎం రాజేశ్వరి, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ గ్రామ శివారులో అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. బలిజిపేట మండలం మురగడం గ్రామానికి చెందిన సింగిశెట్టి కృష్ణమూర్తి 100 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు.

'సికిల్‌సెల్' టెస్టులు చేయాలి


ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియా టెస్టులు చేయాలని, అవగాహన కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిఒ మాట్లాడారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించాలన్నారు. సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలో నిత్యం ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డిఎంహెచ్ఒ మీనాక్షి, డిటిసిఒ అనురాధ, డిప్యూటీ డిఎహెచ్ విజయపార్వతి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి



ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

రోడ్డు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-కొమరాడ

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 9న ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని శనివారం కూనేరులో ప్రచారం చేశారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు బాబూరావు, ప్రసాద్, మధు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో అంటివలస, చంకేసు, దేరుపాడు, వనకాబడి తదితర గ్రామాలకు రహదారి కల్పించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రహదారి సౌకర్యం కోసం చేపట్టే ధర్నాకు గిరిజనులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పక్క చూపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అధికార పార్టీ నాయకులు పక్కదారి చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ యువ నాయకులు పార్టీ కోసం ఎంత కష్ట పడినా గుర్తింపు లేకపోవడంతో విసుగు చెంది పక్క పార్టీలోకి వెళ్ళాలని ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో అధికార పార్టీ గెలిపించడానికి చేతి చమురు వదిలించుకోవడంతో బాటు అన్ని రకాలుగా నష్టం జరిగినా కూడా పార్టీకి కట్టుబడి ఉన్నప్పటికి అధిష్టానం గుర్తించ లేదని యువ నాయకత్వం అసంతృప్తితో రగిలిపోతుంది. అధికార పార్టీ నాయకులమని పేరు తప్ప కనీసం గుర్తింపుకి నోచుకోలేదని ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. మండాలనికి చంపావతి నది అవతల వైపు ఉన్న యువ నాయకుడు ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆ యువ నాయకుడు పార్టీ మరే ఆలోచనలో ఉన్నట్లు తెలిస్తోంది. ఆయన పార్టీ మారితే ఆ ప్రభావం పక్క గ్రామాలైన అలుగోలు, గుషిణి, చనమల్లుపేట, సతివాడపై పడుతుందని యువ నాయకులంతా ఆయన వెంటే పార్టీ మారిపోయే పరిస్థితి ఉందని చర్చ జరుగుతోంది. ఆయన పార్టీ మారితే ప్రతిపక్షం నుంచి జెడ్‌పిటిసిగా అవకాశం ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయినులకు సన్మానం

ప్రజాశక్తి-సాలూరు

సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని జి.కరకవలస పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ముగ్గురు ఉపాధ్యాయినులను సన్మానించారు. మహిళా ఉపాధ్యాయురాలిగా వృత్తికే వన్నె తెచ్చిన సావిత్రిబాయి పూలే సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజమణి అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జానకీరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎ.గణేష్, గౌరవాధ్యక్షులు ఎస్.సింహాచలం, జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్.జగదీష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.187/2021, I.A.1/2023, I.A.3/2023 in O.S.160/2021

Between:
పిట్టా వెంకటరమణ, తండ్రి శేషయ్య, ఫ్లాట్ నెం.401, మయూరి పెర్ల్ డోర్ నెం. 1-18/1-1, ఫస్ట్ ఫ్లోర్, నెం.3, ప్రదీప్ నగర్, విజయనగరం జిల్లా, temporary visit సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా. ....వాది
And:
సుతాపల్లి కృష్ణమూర్తి (died) & వగైరాలు ......ప్రతివాదులు

To:-
D.2) సుతాపల్లి వెంకటరమణ, తండ్రి లేటు కృష్ణమూర్తి @ కృష్ణ, వయస్సు 41 సం॥లు, బాగువలస గ్రామము, పెదపాడు పోస్టు, సాలూరు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
R.5) సుతాపల్లి శ్రీనివాసరావు, తండ్రి లేటు కృష్ణమూర్తి @ కృష్ణ, వయస్సు 43 సం.లు, —Rest do—
R.6) సుతాపల్లి నరసింగరావు, తండ్రి లేటు కృష్ణమూర్తి @ కృష్ణ, వయస్సు 41 సం.లు, —Rest do—

పై నెంబరు దావాలో పైన పేర్కొన్న 2వ ప్రతివాదికి కోర్టు నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలుకున్నూ మరియు పై దావాలో 1వప్రతివాది అయిన సుతాపల్లి కృష్ణమూర్తి @ కృష్ణ మరణించినందున సదరు ఆసామీకి వారసులుగా రెస్పాడెంట్లు 5 మరియు 6లను ప్రతివాదులుగా చేర్పించమని పై నెంబరు పిటిషనును వాది దాఖలు చేసుకొనియున్నారు. సదరు దావా **తేది.25.01.2024**న కోర్టువారు వాయిదా వేసియున్నారు. కావున సదరు **తేది.25.01.2024న ఉదయం 10.30 గం॥**లకు పైన తెలిపిన కోర్టునందు స్వయముగాగాని, వకీలుద్వారా గాని హాజరు అయి, ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మానించబడును.
(శ్రీకోర్టువారి ఉత్తర్వు ప్రకారం)

బొబ్బిలి,
తేది: 05.01.2024

బొత్స రవి
అడ్వకేట్, బొబ్బిలి.